
సాక్షి
పల్నాడు
మంగళవారం । 2 । జనవరి । 2024



భక్తులతో విజయకీలాద్రి కిటకిట
తాడేపల్లి రూరల్ : సీతానగరం విజయకీలాద్రి దేవస్థానం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. నూతన సంవత్సరంలో స్వామిని దర్శించుకునేందుకు అధికంగా వచ్చారు.



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 522.80 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది.



దుర్గమ్మ సేవలో సీఎస్
ఇంద్రకీలాద్రి: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి దంపతులు సోమవారం దుర్గమ్మను దర్శించుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

స్పందన అర్జీలను పెండింగ్‌లో ఉంచవద్దు
అధికారులకు కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి ఆదేశం



గుంటూరు వెస్ట్: స్పందన అర్జీల్ని ఫిర్యాదుదారుడు సంతృప్తి చెందే విధంగా పూర్తి స్థాయిలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది ఒక్క అర్జీ కూడా పెండింగ్‌లో ఉంచవద్దని అధికారులకు చెప్పారు. కోర్టు సంబంధిత అంశాల్ని న్యాయస్థానాల్లోనే పరిష్కరించుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు. అనంతరం వచ్చిన 62 అర్జీలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావు, ఆర్డీవో పి.శ్రీకర్, డీఆర్డీడీఏ పీడీ హరిహరనాథ్, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు, జిల్లా అధికారులు పరిశీలించారు.

ఫైనల్ మెరిట్ లిస్టు విడుదల
గుంటూరు మెడికల్ : పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, డేటా ఎంట్రీ ఆపరేటర్, లాస్ట్ గ్రేడ్ సర్వీస్ కాంట్రాక్టు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న వారి ఫైనల్ మెరిట్ లిస్టు సోమవారం విడుదల చేశారు. లిస్టులో క్లరికల్, టైపోగ్రాఫికల్ తప్పిదాలు ఏమైనా ఉంటే ఈనెల 3వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు తెలియజేయాలని డీఎంహెచ్ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు తెలిపారు. అభ్యర్థుల ఎంపిక మెరిట్, రూరల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం చేశామని, దళారులను నమ్మి మోసపోవద్దని ఆయన సూచించారు. ఉద్యోగాలకు ఎంపికైన ఫైనల్ మెరిట్ లిస్టును గుంటూరు.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని తెలియజేశారు.

హైకోర్టు అధీకృత క్యాలెండర్ ఆవిష్కరణ



నెహ్రూనగర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు అధీకృత నూతన క్యాలెండర్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ సెలవు దినాలు, న్యాయస్థానాల సెలవు దినాలు, పని దినాల వివరాలు క్యాలెండర్‌లో పొందుపరచడం ద్వారా న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, గుమస్తాలకు, కోర్టు సిబ్బందికి చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో 1వ అదనపు జిల్లా జడ్జి రాజగోపాల్‌రావు, 3వ అదనపు జిల్లా జడ్జి అర్చన, 4వ అదనపు జిల్లా జడ్జి శరత్‌బాబు, 5వ అదనపు జిల్లా జడ్జి నీలిమ, పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి సీతారామకృష్ణారావు, గవర్నమెంట్ ప్లీడర్ వెంకటేశ్వర్లు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజశేఖర్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు వట్టి జొన్నల బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవో క్యాలెండర్ ఆవిష్కరణ



గుంటూరు మెడికల్: నూతన సంవత్సరం పురస్కరించుకుని సోమవారం జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డిని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను కలెక్టర్ వేణుగోపాలరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, కార్యదర్శి శెట్టి సతీష్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.వెంకటరెడ్డి, మహిళ విభాగం జిల్లా చైర్‌పర్సన్ ఎం.రాధారాణి, నగర అధ్యక్షుడు సూరి తదితరులు పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలి టౌన్: తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2200, గరిష్ట ధర రూ.3200, మోడల్ ధర రూ.2700 వరకు పలికింది.






కలెక్టరేట్‌లో సిబ్బంది సమక్షంలో కేకు కట్ చేస్తున్న కలెక్టర్ శివశంకర్, గుంటూరులో ఐజీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, కలెక్టర్ శివశంకర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న జేసీ శ్యాంప్రసాదు , కేక్ కట్ చేస్తున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

గ్రాండ్ వెల్‌కమ్
నిండు పున్నమి వెన్నెల మిలమిలా మెరిసినట్టు.. తారలన్నీ తారాజువ్వలై మిరుమిట్లుగొలిపినట్టు.. నవ్వులే కొత్త ఉషస్సులై కాంతులీనినట్టు.. నాట్యరీతులన్నీ సప్తస్వరాలతో జతకట్టి నర్తించినట్టు.. కొత్త సంవత్సర ఉత్సాహం అంబరాన్నంటింది. ఊరూవాడా సంబరమై మురిసింది. శుభాకాంక్షల వెల్లువలో ఉమ్మడి గుంటూరు జిల్లా తడిసిముద్దయింది. కేకుల కేరింతలతోపాటు పుష్పమాలికల సోయగాలు నవోదయానికి ఆహ్వానం పలికాయి. ఆలయాల్లో ఆధ్యాత్మికోత్సహం పరవళ్లుతొక్కింది. – సాక్షినెట్‌వర్క్

ప్రజా బలం లేకే టీడీపీ దాడి

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖమంత్రి, పశ్చిమ సమన్వయకర్త విడదల రజిని




దాడి గురించి వివరిస్తున్న మంత్రి రజిని, ఎమ్మెల్యే గిరి (ఇన్‌సెట్‌లో) టీడీపీ, జనసేన కార్యకర్తలు విసిరిన రాళ్లు

నెహ్రూనగర్: తెలుగుదేశం పార్టీకి క్షేత్రస్థాయిలో ప్రజా బలం లేదని, ఆ విషయం తెలిసే దాడులకు తెగబడుతున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త విడదల రజిని ధ్వజమెత్తారు. గుంటూరులోని కొరిటెపాడు రోడ్డు చంద్రమౌళీ నగర్ ప్రధాన రహదారిలో సోమవారం కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయాన్ని ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మేయర్ కావటి మనోహర్‌నాయుడు, పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫాలతో కలసి ఆమె ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ బీసీ మహిళ రాజకీయాలు చేయడం టీడీపీ పెత్తందారులకు ఇష్టం లేదని, అందుకే తనను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడుతున్నారని మండిపడ్డారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబసభ్యులమంతా కలసికట్టుగా టీడీపీ దౌర్జన్యాల్ని ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. నేర చరిత్ర ఉన్న వ్యక్తులు టీడీపీలో ఉన్నారని, వారే ఇలాంటి దాడులు చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని, జగనన్న ఆశీస్సులతో ప్రజలకు సేవ చేస్తున్నానని తెలిపారు. నూతన సంవత్సర వేడుకలు పేరుతో టీడీపీ గూండాలు నూతన కార్యాలయంపై దాడికి పాల్పడ్డారని ధ్వజమెత్తారు. గుంటూరు నగర ప్రజలు శాంతిని కోరుకుంటారని, క్రమశిక్షణతో ఉంటారని, ఇలాంటి దాడుల్ని ఎవరూ స్వాగతించరని పేర్కొన్నారు. రౌడీయిజం ద్వారా విధ్వంసాలు చేసేవారికి ప్రజలే తగిన విధంగా బుద్ధి చెబుతారని తెలిపారు. తమ నాయకుడు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కూడా తమకు శాంతి, సహనంగా ఉండాలని మాత్రమే చెప్పారని, దాడులు చేయడం తమ పార్టీ విధానం కాదని మంత్రి పేర్కొన్నారు. గుంటూరు నగర అభివృద్ధే ధ్యేయంగా తాము ముందుకు వెళతామని తెలిపారు. అలజడులు సృష్టించి లబ్ధి పొందాలనే నైజానికి తాము ఎల్లప్పుడూ దూరంగా ఉంటామని మంత్రి వెల్లడించారు. ఓటమి భయంతోనే టీడీపీ అల్లరి మూకలు పార్టీ కార్యాలయం విధ్వంసానికి పాల్పడ్డారని దుయ్యబట్టారు. ఈ కుట్ర వెనుక ఎవరున్నా వదిలిపెట్టే ప్రసక్తే ఉండదని, చట్టప్రకారం ముందుకు వెళతామని స్పష్టం చేశారు.



దాడిలో పలిగిన పార్టీ కార్యాలయ భవనం అద్దాలు

సాగర్‌మాత ఆలయంలో ఘనంగా న్యూ ఇయర్ వేడుకలు



విజయపురిసౌత్: స్థానిక సాగర్‌మాత ఆలయంలో నూతన సంవత్సర వేడుకలు విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భక్తులనుద్దేశించి సందేశమిస్తూ మోసకరం, దుష్టవాంఛలతో కూడిన పాత జీవితాన్ని వదిలి వేయాలన్నారు. దేవుడినే తన మాతృగర్భమనే మందసంలో మోసిన తల్లి మరియమాత అని అన్నారు. ఈ నూతన సంవత్సరంలో దేవుని బిడ్డలు చల్లగా జీవించేలా ఆ తల్లి దీవెనలు ప్రతి ఒక్కరికీ కలగాలని ప్రార్థన చేశారు. దివ్యబలి పూజలో ఫాదర్ జోసఫ్ తంబి, సిస్టర్స్, ఆలయ కమిటీ సభ్యులు దుగ్గెంపూడి ఇన్నారెడ్డి, మాలపాటి మరియదాసు, భక్తులు పాల్గొన్నారు.

జిల్లాలో త్వరితగతిన పింఛన్ల పంపిణీ

- కలెక్టర్ ఎల్.శివశంకర్
- కలెక్టరేట్‌లో లాంఛనంగా ప్రారంభం
- జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వేడుకలు



లబ్ధిదారురాలికి పెరిగిన పింఛన్ అందజేస్తున్న కలెక్టర్

నరసరావుపేట: జిల్లాలో పెరిగిన వైఎస్సార్ పింఛన్‌ను లబ్ధిదారులందరికీ వెంటనే అందజేయాలని కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పింఛన్‌ను రూ.2750 నుంచి రూ.3వేలకు పెంచిన సందర్భంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ బాలూనాయక్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో పెరిగిన పింఛన్‌ను లబ్ధిదారులకు సోమవారం నుంచే అందజేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో పింఛన్ పెరిగిన లబ్ధిదారుల సంఖ్య 2.38లక్షల దాకా ఉందని చెప్పారు. వారందరికీ 24గంటల వ్యవధిలోనే అందజేసే విధంగా ప్రణాళిక రూపొందించినట్లు పేర్కొన్నారు. ఒకటో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు ప్రతి మండలం, సచివాలయం పరిధిలో పండగలా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు. లబ్ధిదారులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. పీడీ బాలూనాయక్ మాట్లాడుతూ జిల్లాలో 2,82,568 మందికి పెంచిన పెన్షన్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఇందులో వృద్ధులు 1,50,118 మంది, చేనేత కార్మికులు 2,255, వికలాంగులు 35,635 , వితంతువులు 67,677 , కల్లు గీత కార్మికులు 334 , అభయ హస్తం 3,757 , ట్రాన్స్‌జెండర్లు 55 , మత్స్యకారులు 714 , ఒంటరి మహిళలు 12,054 , చర్మకారులు 4,661, డప్పు కళాకారులు 3,136 , కళాకారుల పెన్షన్లు 123, సైనిక్ వెల్ఫేర్ 10, డయాలసిస్ పేషెంట్లు 300, దీర్ఘకాలిక రోగులు 1,681 మంది ఉన్నారని ఆయన వివరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ పెన్షన్ కానుక బ్రోచర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీడీవో మహాలక్ష్మి, లింగంగుంట్ల పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలి

- జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- పార్టీ కార్యాలయంలో కోలాహలంగా నూతన సంవత్సర వేడుకలు



అర్చకుల ఆశీర్వచనాలు అందుకుంటున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఆనందంగా జీవించాలని మంత్రి అంబటి రాంబాబు ఆకాంక్షించారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం ఆయన ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వ హించారు. నాయకులు, కార్యకర్తలు, జిల్లా, డివిజన్, మండల అధికారులు పెద్దఎత్తున తరలి వచ్చారు. పూలమాలలు, దుశ్శాలువాలు, పుష్పగుచ్ఛాలతో అంబటి రాంబాబును సత్కరించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మరి కొందరు నోట్ పుస్తకాలు, పెన్నులు, మొక్కలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో కొత్త ఆశలతో ముందుకు సాగాలని తెలిపారు.. ముందుగా నూతన సంవత్సరం పురస్కరించుకొని కేకులు కట్ చేసి వేడుకల్ని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులకు మంత్రి అన్నసంతర్పణతో ఆతిథ్యం ఇచ్చారు. పట్టణంలో మాజీ శాసనసభ్యుడు యర్రం వెంకటేశ్వర రెడ్డిని నూతన సంవత్సర సందర్భంగా పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు కలసి పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసిని పలువురు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, మున్సిపల్ అధికారులు కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

యార్డులో 48,615 బస్తాల మిర్చి


కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 48,615 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 43,688 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.22,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 23,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.14,000 నుంచి రూ.21,000 వరకు పలికింది.

భవానీ దీక్షల విరమణకు సన్నద్ధం

- రేపు ఉదయం అగ్నిప్రతిష్ఠాపన
- 5 లక్షల మంది భవానీలు విచ్చేస్తారని అంచనా
- 20 లక్షల లడ్డూలను సిద్ధం చేస్తున్న దేవస్థానం
- గిరి ప్రదక్షిణ మార్గంలో మరిన్ని సదుపాయాలు



సిద్ధమైన క్యూలైన్లు



విద్యుత్‌దీపాల వెలుగుల్లో ఇంద్రకీలాద్రి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఈ నెల మూడో తేదీ నుంచి ప్రారంభమయ్యే భవానీ దీక్షల విరమణకు సర్వం సిద్ధమైంది. ఈ నెల ఏడో తేదీ వరకు కొనసాగే దీక్షల విరమణకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్నాటక, ఒడిశా నుంచి భవానీ మాలధారులు ఇంద్రకీలాద్రికి తరలిరానున్నారు. ఈ ఏడాది సుమారు ఐదు లక్షల మందికి పైగా భవానీలు దీక్షల విరమణకు విచ్చేస్తారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. భవానీల రద్దీకి అనుగుణంగా అమ్మవారి దర్శనంలో వారికి ఎటువంటి ఇబ్బందులూ కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. మరో వైపు ఆలయ ప్రాంగణంతో పాటు స్నాన ఘాట్లు, తలనీలాలు సమర్పించే కేశఖండన శాలలు, లడ్డూ ప్రసాదం కౌంటర్లు, అన్న ప్రసాద వితరణ కేంద్రాల ఏర్పాటు పనులు పూర్తయ్యాయి. మంగళవారం మధ్యాహ్నం నుంచే భవానీలు నగరానికి తరలివచ్చే అవకాశం ఉందని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. ఆ రోజు రాత్రే పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి, తెల్లవారుజామున గిరి ప్రదక్షిణ పూర్తిచేసుకున్న అనంతరం క్యూలైన్‌లోకి చేరుకుంటారు.

అగ్నిప్రతిష్ఠాపనతో దీక్షల విరమణ ప్రారంభం

మూడో తేదీ ఉదయం ఆరు గంటలకు అమ్మవారి ప్రధాన ఆలయంలో మూలవిరాట్‌కు ఆలయ అర్చకులు, వైదిక కమిటీ సభ్యులు పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. అనంతరం ఆలయం నుంచి అర్చకులతోపాటు చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ కె.ఎస్.రామారావు, పాలక మండలి సభ్యులు మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా మహా మండపం దిగువన ఉన్న హోమగుండాల వద్దకు చేరుకుంటారు. మహా మండపం ఎదుట ఏర్పాటు చేసిన రెండు హోమ గుండాల్లో ఉదయం 6.30 గంటలకు అగ్నిప్రతిష్ఠాపన చేస్తారు. దీంతో దీక్షల విరమణ లాంఛనంగా ప్రారంభమవుతుంది. అప్పటికే అమ్మవారి దర్శనం పూర్తి చేసుకుని కొండ దిగువకు చేరుకునే భవానీలు ఇరుముడులను సమర్పించిన అనంతరం హోమ గుండంలో నేతి కొబ్బరి కాయలను సమర్పించడంతో దీక్ష పరిసమాప్తం చేసుకుంటారు.

శబరిమల రద్దీ నేపథ్యంలో మరింత అప్రమత్తం

ఈ ఏడాది గతంలో ఎన్నడూ లేని రీతిలో శబరిమల అయ్యప్ప సన్నిధిలో స్వాముల రద్దీ అధికంగా కనిపించింది. శబరిమలలో అయ్యప్ప దర్శనానికి 12 నుంచి 16 గంటల సమయం పట్టేలా రద్దీ కొనసాగుతోంది. దీంతో భవానీ దీక్షలు కూడా భక్తులు అధికంగానే స్వీకరించి ఉంటారని దేవస్థానం అంచనా వేస్తోంది. భవానీల రద్దీని ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని దేవస్థాన చైర్మన్, ఈఓ పాలక మండలి సమావేశంలో చర్చించారు. పోలీసు శాఖ, రెవెన్యూ శాఖలు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాయి. రైల్వే స్టేషన్, బస్టాండ్‌తో పాటు పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాల వద్ద రద్దీని అంచనా వేయడంతో పాటు స్నానఘాట్లు, గిరి ప్రదక్షిణ మార్గాలు, క్యూలైన్‌లపై దృష్టి పెడుతున్నారు.

కోవిడ్ నిబంధనలు తప్పని సరి...!

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కరోనా కేసులు పెరుగుతుండటంతో భవానీలు కోవిడ్ నిబంధనలను తప్పని సరిగా పాటించాలని దేవస్థానం సూచిస్తోంది. భవానీలు తమ స్వస్థలాల నుంచి బయలుదేరినప్పటి నుంచి మాస్కులు ధరించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొంటోంది. దీక్షల విరమణకు నిత్యం వేలాది మంది భవానీలు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే అవకాశం ఉండటంతో ఎవరికి వారు తమ స్వీయ రక్షణ చర్యలు తీసుకోవాలని ఆలయ అధికారులు సూచిస్తున్నారు.

వైభవంగా సీతారాముల తెప్పోత్సవం

నగరంపాలెం: స్థానిక సంపత్‌నగర్ శ్రీరామనామ క్షేత్రంలో 97వ శ్రీరామకోటి మహోత్సవ వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం శాంతి హోమం, మహాపూర్ణాహుతి, వసంత సేవ, అవబృదోత్సవం, మూర్తికుంభ తీర్థ ప్రోక్షణం భక్తిశ్రద్ధలతో జరిగాయి. స్వామిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక పురాణాలు, భక్తి రంజని కార్యక్రమాల్ని నిర్వహించారు. శృంగేరి పీఠాధీశ్వరుల, జగత్ గురువులు భారతి తీర్థ మహాస్వామి, విధుశేఖర భారతి స్వామివారి దివ్యాశీస్సులతో రామనామక్షేత్ర గౌరవ అధ్యక్షులు పోలిశెట్టి హరిప్రసాద్ , ట్రస్టీస్ రాగం వెంకటలీలాసుందరి, మస్తాన్‌రావు దంపతులు, పలువురు దాతల సహకారంతో కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం భక్తులు శ్రీరామనామంతో, విశేష పూజలతో స్వామిని పుష్కరణికి చేర్చి, తెప్పోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు.



పుష్కరిణిలో జల విహారం చేస్తున్న శ్రీ సీతారామస్వామి

క్లుప్తంగా

జిల్లా పోలీసు కార్యాలయంలో న్యూఇయర్ వేడుకలు

నరసరావుపేట: జిల్లా పోలీసు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కార్యాలయంలోని అదనపు ఏఆర్ ఎస్పీ డి.రామచంద్ర రాజు, శాంతిభద్రతల విభాగం అదనపు ఎస్పీ రాఘవేంద్ర, డీఎస్పీలు కె.పల్లపురాజు, బి.ఆదినారాయణ, కేవీ మహేష్, సీఐలు, ఎస్ఐలు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డిని కలసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వారి సమక్షంలో ఎస్పీ కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు.

విజ్ఞాన్‌లో జాతీయస్థాయి క్రికెట్ పోటీలు ఆరంభం



చేబ్రోలు: మండల పరిధిలోని వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ విద్యార్థుల ఆధ్వర్యంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలతో పాటు మహోత్సవ్-2కే 24లో భాగంగా నిర్వహిస్తున్న జాతీయస్థాయి క్రికెట్ చాంపియన్‌షిప్ పోటీలను ఘనంగా ప్రారంభించారు. ఈ చాంపియన్‌షిప్‌లో విజేతలుగా నిలిచిన జట్లకు ప్రశంసా పత్రాలు, మెడల్స్‌తో పాటు మొదటి నాలుగు స్థానాలు పొందిన జట్లకు రూ.50, రూ.30, రూ.20, రూ.10 వేలు నగదు బహుమతులను అందజేస్తామని వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించడానికి సరికొత్త మార్గాలను అన్వేషించాలన్నారు. నూతన టెక్నాలజీలపై అవగాహన పెంచుకున్న విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. నూతన సంవత్సరంలో విద్యార్థులు కష్టమైన లక్ష్యాన్ని ఎంచుకుని వాటి సాధనకు కృషి చేయాలన్నారు. విద్యార్థులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి కేక్‌ను కట్ చేశారు. క్రికెట్ చాంపియన్ షిప్‌లో భాగంగా మ్యాన్ ఆఫ్ ద సిరీస్, బెస్ట్ బ్యాట్స్‌మెన్, బెస్ట్ బౌలర్, మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ అవార్డులను అందజేస్తామన్నారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ పీఎంవీ రావు పాల్గొన్నారు.

ఘనంగా నూతన సంవత్సర సంబరాలు



ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలను గజమాలతో సత్కరిస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ తురక కిషోర్

కేక్ కట్ చేసిన ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల: నూతన సంవత్సర వేడుకలను ఆదివారం అర్ధరాత్రి నుంచి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో వారి తండ్రి వెంకటేశ్వరరెడ్డితో కలసి వేడుకల్లో పాల్గొన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ తురక కిషోర్ కార్యాలయం వద్ద కేక్ కట్ చేశారు. గురజాల డీఎస్పీ పల్లపురాజు, అర్బన్, రూరల్, కారెంపూడి సీఐలు శరత్‌బాబు, షేక్ షమీముల్లా, జయకుమార్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. తొలుత వివిధ ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ప్రభుత్వ విప్ పీఆర్కే కార్యాలయంలో భారీ స్థాయి కేక్ కట్ చేశారు. అక్కడ నుంచి పలు ప్రాంతాలలో అభిమానులు సంబరంగా నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, మున్సిపల్ మాజీ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు పోలా శ్రీను, అధ్యక్షుడు గోపవరపు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, మున్సిపల్ మాజీ చైర్మన్ అబ్దుల్ జలీల్, బత్తుల ఏడుకొండలు మార్కెట్ యార్డు చైర్మన్లు తాడి వెంకటేశ్వరరెడ్డి, వెలిదండి గోపాల్, జెడ్పీటీసీ సభ్యులు మండ్లి పెద మల్లు స్వామి, రూప్లీబాలునాయక్, శెట్టిపల్లి యలమంద, ఎంపీపీలు ఏచూరి సునీత సాయిశంకర్, చింతా శివ రామయ్య, షేక్ బాషా, మేకల శారద శ్రీనివాసరెడ్డి, చౌడేశ్వరి, వార్డు కౌన్సిలర్లు చిల్లంచర్ల సత్యనారాయణ, ఎం.శ్రీనివాసరావు, అనంతరావమ్మ, ఆర్యవైశ్య నాయకులు ఆర్యవైశ్య నాయకులు మారం వాసు, మారం ప్రసాద్, కె.పాండు రంగారావు, ఎ.నారాయణ, పూర్ణచంద్రరావు, కె.బ్రహ్మారావు, శ్రీనివాసరావు, మల్లారెడ్డి ఉన్నారు.

గుంటూరు రేంజ్ కార్యాలయంలో వేడుకలు..

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు కలెక్టర్ బంగ్లా రోడ్‌లోని గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు కార్యాలయంలో సోమవారం నూతన సంవత్సర (2024) వేడుకలు జరిగాయి. కేక్‌లను ఐజీ కట్ చేశారు. రేంజ్‌లోని ఎస్పీలు కె.ఆరిఫ్‌హఫీజ్ (గుంటూరు జిల్లా), వై.రవిశంకర్‌రెడ్డి (పల్నాడు జిల్లా), కె.తిరుమలేశ్వరరెడ్డి (ఎస్పీఎస్ నెల్లూరు జిల్లా) పలు జిల్లాల ఏఎస్పీలు నిచికేత్‌షెల్కే, కె.సుప్రజ, శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు రేంజ్ ఐజీని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు, మొక్కలు అందించారు. అనంతరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

గుంటూరులో..

జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లో నూతన సంవత్సర వేడుకలు సోమవారం జరగ్గా, ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ కేక్ కట్ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమష్టిగా, సమర్థంగా నూతన సంవత్సరంలో నూతనోత్తేజంతో విధులు నిర్వహించాలని అన్నారు. జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. తద్వారా జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తేవాలని సూచించారు. ఎస్పీని ఏఎస్పీలు నిచికేత్‌షెల్కే(తూర్పు సబ్ డివిజన్), కె.సుప్రజ (పరిపాలన), శ్రీనివాసరావు (ఎల్/ఓ), ఎ.శ్రీనివాసరావు (క్రైం), పలువురు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు మర్యాద పూర్వకంగా కలిసి మొక్కలు, పుష్పగుచ్ఛాలు అందించి గజమాలతో సత్కరించారు.

ముందు జాగ్రత్తే మందు

- కుష్ఠు రోగులను గుర్తించేందుకు ఇంటింటా సర్వే
- గత నెల 27 నుంచి ప్రారంభమైన సర్వే
- జిల్లాలో 112 మంది కుష్ఠు బాధితులు
- జూలైలో నిర్వహించిన సర్వేలో 56 మంది గుర్తింపు
- జిల్లాలో 1,451 బృందాలతో ఈ నెల 12 వరకు సర్వే
- పల్నాడు జిల్లాలో కొత్తగా ఐదు కేసులు గుర్తింపు



క్రోసూరు పీహెచ్‌సీ పరిధిలో సర్వే చేస్తున్న వైద్య బృందం

సత్తెనపల్లి: కుష్ఠుపై ప్రభుత్వం యుద్ధం ప్రకటించింది. గుర్తించేందుకు జల్లెడ పడుతోంది. ఇప్పటికే సర్వే చేపట్టారు. జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ విభాగం ఆధ్వర్యంలో గత నెల 27వ తేదీ నుంచి ఈనెల 12వ తేదీ వరకు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. ఇందుకోసం జిల్లాలో 1,451 బృందాలు పని చేస్తున్నాయి. ప్రతి బృందంలో ఒక ఆశ కార్యకర్త, సచివాలయ వలంటీర్లు ఉంటారు. వారు జిల్లాలోని 22,11,607 జనాభాలో 5.30 లక్షల ఇళ్లను సందర్శించి వ్యాధి లక్షణాలు ఏమైనా ఉన్నాయేమోనని పరిశీలిస్తున్నారు. అనుమానిత లక్షణాలున్న వారిని సమీప ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి వైద్యులతో పరీక్ష చేయిస్తారు. వ్యాధి నిర్ధారణ అయితే వైద్యశాలలోని వ్యాధి విభాగం లేదా చర్మ వ్యాధుల విభాగానికి పంపించి చికిత్స చేయిస్తారు. ఇదే సమయంలో కేసు బయట పడిన చుట్టుపక్కల 300 ఇళ్లల్లో స్క్రీనింగ్ నిర్వహిస్తారు. కేసు బయట పడిన ఇంటిలోని వారందరికీ కుష్ఠు లేకపోయినా ముందు జాగ్రత్తగా మందులు ఇస్తారు. కుష్ఠు వ్యాధిగ్రస్తులకి మాత్రం ఒంట్లో పాసిబ్ బేసిల్‌లై(తక్కువ స్థాయిలో లెప్రసీ క్రిములు) ఉంటే ఆరు నెలలు, మల్టీ బేసిల్‌లై(అధిక శాతం లెప్రసీ క్రిములు) ఉంటే 9 నెలల పాటు మల్టీ డ్రగ్ థెరపీ(ఎండీటీ) మందులను ఉచితంగా అందజేస్తారు. జిల్లాలో 2022 డిసెంబర్ 31 నాటికి 124 కేసులు ఉండగా, 2023 డిసెంబర్ 31 నాటికి 112 కేసులు ఉన్నాయి. ఆరు నెలల క్రితం నిర్వహించిన సర్వేలో 56 కేసులను గుర్తించారు. మొత్తం 112 మంది వ్యాధిగ్రస్తులు చికిత్స పొందుతున్నారు. ప్రస్తుత సర్వేలో జిల్లా వ్యాప్తంగా ఐదు కొత్త కేసులను గుర్తించారు.



ఏనుగుపాలెం పీహెచ్‌సీ పరిధిలో అనుమానితులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

కుష్ఠు వ్యాధికి ఉచితంగా చికిత్స



కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు గత నెల 27 నుంచి ఈ నెల 12వ తేదీ వరకు సర్వే నిర్వహించనున్నాం. సర్వే నిమిత్తం జిల్లాలో మొత్తం 1,451 బృందాలు తిరుగుతున్నాయి. ప్రతి రోజు 50 నుంచి 100 ఇళ్ల స్క్రీనింగ్ నిర్వహిస్తారు. అనుమానిత కేసులను గుర్తించి ప్రభుత్వ ఆసుపత్రుల్లో వ్యాధి నిర్ధారణ చేసి చికిత్స ఇస్తారు. ఒక కేసు గుర్తించిన చోట చుట్టుపక్కల 300 ఇళ్లల్లో స్క్రీనింగ్ చేస్తారు. ఈ వ్యాధి గురించి భయపడాల్సిన అవసరం లేదు. ఆరు నెలలు మందులు వాడితే పూర్తిగా నయమవుతుంది. ప్రతి ఆరోగ్య కేంద్రంలో మందులు ఉచితంగా లభిస్తాయి. అంగవైకల్యం ఉన్నవారికి శస్త్ర చికిత్సను ఉచితంగా చేయించుకోవచ్చు.

– డాక్టర్ కె.మురళీకృష్ణ, జిల్లా ఇన్‌చార్జి, ఎయిడ్స్ అండ్ లెప్రసీ అధికారి

వ్యాధి లక్షణాలు...

- ఈ వ్యాధి బ్యాక్టీరియా ద్వారా వస్తుంది.
- చర్మంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు
- చెవులపై బుడిపెలు, కణితులు, తిమ్మిర్లు
- కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం
- చేతుల నుంచి వస్తువులు జారిపోవడం
- అరచేతులు, అరికాళ్లల్లో స్పర్శ కోల్పోవడం
- తెలియకుండానే చేతులు, కాళ్లల్లో బొబ్బలు రావడం
- చేతివేళ్లు, కాలివేళ్లు వంకర్లు తిరిగి అంగవైకల్యం రావడం
- కాళ్లకు చెప్పులు జారిపోవడం
- చల్లని, వేడి వస్తువులను గుర్తించలేకపోవడం
- పాదాలు (మడిమలు) వాపు ఉండడం



ప్రకాష్‌నగర్ పార్టీ కార్యాలయంలో కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



కలెక్టరేట్‌లో కలెక్టర్ శివశంకర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి -నరసరావుపేట

మద్యం తరలిస్తున్న టీడీపీ కౌన్సిలర్ అరెస్టు

గురజాల: తెలంగాణ మద్యం తరలిస్తున్న తెలుగుదేశం పార్టీకి చెందిన వార్డు కౌన్సిలర్ సీహెచ్ శ్రీనివాసరావును అరెస్టు చేసినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో (సెబ్) ఎస్ఐ ఎం.జయరాం తెలిపారు. స్థానిక సెబ్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. దాచేపల్లి మండలంలోని పొందుగుల సరిహద్దు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా టీడీపీ కౌన్సిలర్ సీహెచ్ శ్రీనివాసరావు వాహనంలో 36 బాటిళ్ల మద్యం ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వాహనంలో ఓ స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐతో పాటు కొండలు అనే వ్యక్తి ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.
కౌన్సిలర్ శ్రీనివాసరావుతో పాటు కొండలును అరెస్ట్ చేసి వీరి వద్ద నుంచి 36 బాటిళ్లు, కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఏఎస్ఐ పరారీలో ఉన్నట్లు చెప్పారు. దాడుల్లో సీఐ ఆర్.వి.రమణమ్మ, ఎస్ఐ ఆంజనేయులు ఉన్నట్లు వివరించారు. స్వాధీనం చేసుకున్న మద్యాన్ని గురజాల సెబ్ కార్యాలయానికి అప్పగించినట్లు తెలిపారు.

అంకితభావంతో బజరంగ్ ఫౌండేషన్ సేవలు

తక్కెళ్లపాడులో 695 మందికి కళ్లజోళ్లు పంపిణీ



తక్కెళ్లపాడులో ప్రజల మధ్య 51 కిలోల కేక్ కట్ చేసి వృద్ధురాలికి తినిపిస్తున్న బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: అంకిత భావంతో బజరంగ్ ఫౌండేషన్ సేవలను కొనసాగిస్తున్నట్టు వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ చెప్పారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేరుస్తూ, ప్రజారంజకమైన పాలనను అందిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో తాము ప్రజాసేవలో ముందడుగు వేస్తున్నట్లు ప్రకటించారు. బజరంగ్ జగన్నామ సంక్షేమంలో భాగంగా గత ఏడాది డిసెంబరు 27న మండలంలోని తక్కెళ్ళపాడు గ్రామంలో జరిగిన బజరంగ్ సంగమం కార్యక్రమంలో నేత్రజ్యోతిలో పాల్గొన్న గ్రామస్తులు 695 మందికి వ్యక్తిగత కళ్ళజోళ్ళు అవసరమని డాక్టర్లు నిర్ధారించారు. దీంతో సోమవారం అంబటి మురళీకృష్ణ గ్రామస్తులకు కళ్లజోళ్లు అందించారు. అనంతరం గ్రామ ప్రజల మధ్య 51 కిలోల కేక్ కట్ చేశారు. అనంతరం మురళీకృష్ణ మాట్లాడుతూ సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పేదలపై ప్రత్యేక శ్రద్ధ ఉందని, ఆయన స్ఫూర్తితోనే తామంతా ముందుకు సాగుతున్నట్టు స్పష్టం చేశారు.

కలెక్టరేట్‌లో క్యాలెండర్ ఎగ్జిబిషన్ ఏర్పాటు

ప్రారంభించిన జిల్లా కలెక్టర్ శివశంకర్



కలెక్టరేట్‌లో ఎగ్జిబిషన్ తిలకిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, జేసీ శ్యాంప్రసాద్


నరసరావుపేట: జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన తెలుగు, ఆంగ్ల క్యాలెండర్ ఎగ్జిబిషన్‌ను కలెక్టర్ శివశంకర్ లోతేటి ప్రారంభించారు. క్యాలెండర్ చరిత్రతో 12 నెలల తెలుగు, ఆంగ్లంను ఉపయోగించి రూపొందించిన వివరాలతో ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. తెలుగు పదాలైన చైత్రమాసం మొదలుకొని ఫాల్గుణం వరకు అన్ని నెలలను ఆంగ్ల మాసాలతో కలుపుతూ వివరాలతో రూపొందించిన క్యాలెండర్ అద్భుతంగా ఉందని కలెక్టర్ ప్రశంసించారు. ఆంగ్ల క్యాలెండర్ జూలియన్, హిందూ క్యాలెండర్ హిజ్రీ, ఇస్లామిక్, బౌద్ధ క్యాలెండర్, జపనీస్, చైనీస్, హిబ్రూ క్యాలెండర్ రూపొందించిన చిత్రాలను ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. కలెక్టరేట్‌కు వచ్చిన పలువురు జిల్లా అధికారులు, సందర్శకులు ఎగ్జిబిషన్ ఆసక్తిగా తిలకించారు. పలువురు తమ తమ జీవితాల్లో ఏ నెల వస్తుందో చూసుకున్నారు. జాయింట్ కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, కలెక్టరేట్ ఏఓ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణకు చర్యలు

నరసరావుపేట: జిల్లాలో గాలికుంటు వ్యాధి పకడ్బందీగా నివారించేందుకు పశుసంవర్ధక శాఖ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల రెండో తేదీ నుంచి జాతీయ పశువ్యాధి నివారణ కార్యక్రమం కింద పశువులకు గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్ నుంచి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు కలెక్టర్ చైర్మన్‌గా జిల్లా పర్యవేక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా పశుసంవర్ధకశాఖ సంచాలకులు కన్వీనర్‌గాను, నరసరావుపేట నియోజకవర్గ పశుసంవర్ధకశాఖ ఉపసంచాలకులు, నియోజకవర్గ పశుసంవర్ధకశాఖ సహాయసంచాలకులు సభ్యులుగా వ్యవహరించనున్నారు. జిల్లా పశు సంవర్ధక శాఖకు చెందిన వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, పారా వెటర్నరీ సిబ్బంది, సచివాలయ పశు సంవర్ధక సహాయకులు విజయవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్, గాలికుంటు టీకాలను ఆవిష్కరించారు. పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి కాంతారావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ విజేతగా బాపట్ల

ఫైనల్‌లో విజయనగరంపై గెలుపు



క్రీడాకారులను అభినందిస్తున్న షూటింగ్ బాల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బాబూరావు



విజేతలకు మెమొంటోలు అందిస్తున్న కార్పొరేటర్ నూకతోటి మస్తానమ్మ, ఈశ్వరరావు

చీరాల రూరల్/చీమకుర్తి: అండర్-17 షూటింగ్ బాల్ విజేతగా బాపట్ల జిల్లా జట్టు నిలిచింది. గతేడాది డిసెంబర్ 30, 31 తేదీల్లో ప్రకాశం జిల్లా పేర్నమిట్టలో రాష్ట్రస్థాయి అండర్-17 షూటింగ్ బాల్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో రాష్ట్రంలోని 17 జిల్లాలకు చెందిన బాల, బాలికలు పాల్గొని తమ సత్తాచాటారు. ఈసందర్భంగా సోమవారం జిల్లా షూటింగ్ బాల్ జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ డాక్టర్స్ విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ విస్సర్ల బాబురావు క్రీడాకారులను అభినందించి మాట్లాడారు. బాపట్ల జిల్లాకు చెందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని సత్తా చాటడం ఎంతో అభినందనీయమని, గర్వకారణమన్నారు. ఫైనల్‌లో విజయనగరం జిల్లా జట్టుపై 2-0 తేడాతో గెలిచి విజేతగా నిలిచి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుందని చెప్పారు. ఇదే ఉత్సాహంతో మరిన్ని విజయాలు సాధించాలని ఆయన పేర్కొన్నారు. క్రీడాకారులకు తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు అందిస్తానని చెప్పారు. అనంతరం క్రీడాకారులకు పూలమాలలువేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు.

జెడ్పీలో న్యూ ఇయర్ వేడుకలు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లా పరిషత్ క్యాంపు కార్యాలయంలో సోమవారం కొత్త సంవత్సర వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, సురేష్‌కుమార్ దంపతులు కేక్ కట్ చేశారు. జెడ్పీ డైరీని ఆవిష్కరించారు. కారుణ్య నియామకాల ద్వారా నలుగురికి టైపిస్టులుగా ఉద్యోగాలిస్తూ ఉత్తర్వులు అందజేశారు. తొమ్మిది మంది ఆఫీస్ సబార్డినేట్లకు రికార్డు అసిస్టెంట్, ల్యాబ్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. 4వ తరగతి ఉద్యోగులకు దుస్తులు బహూకరించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జె.మోహన్‌రావు, జెడ్పీ వైస్ చైర్మన్ బి.అనూరాధ, కాకుమాను జెడ్పీటీసీ గుల్జార్‌బేగం పాల్గొన్నారు.